క్లుప్తంగా

విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులతో కలెక్టర్, అధికారులు

జగిత్యాల: చదువుతో పాటు, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు శ్రీకేశ్, సాహిత్‌పటేల్, చైతన్య, అలకనంద, పల్లెపు సౌమిత, విజ్ఞానిరెడ్డి, సాహితిలను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నప్పుడే ఉన్నత స్థానాలకు వెళ్తారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, దివాకర, క్రీడల శాఖ అధికారి రవి పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్, కేజీబీవీ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సీసీఆర్) మండల ఇన్‌చార్జి తాలుకా మల్లేశ్ సోమవారం తెలిపారు. మూడు విద్యాలయాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారన్నారు. క్రీడా మైదానంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దానిని మార్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ ఇస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జోగిరాం వంశీకి 2 కిడ్నీలు చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఆయన తండ్రి శ్రీనివాస్ తన కిడ్నీని కొడుకుకు దానం ఇచ్చేందుకు ముందుకు రాగా, దీని కోసం ఆస్పత్రిలో రూ.10 లక్షలు అవసరం ఉండగా జోగిరాం వంశీకి రూ. రెండున్నర లక్షలు, జోగిరాం శ్రీనివాస్‌కు రూ. 2 లక్షల చొప్పున ఎల్‌వోసీలను సోమవారం మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అందచేశారు. మిగతా రూ. 5 లక్షల 30 వేలు ఆపరేషన్ రోజున అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వాటర్ ఫిల్టర్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వాటర్ ఫిల్టర్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని నేషనల్ హాకర్ ఫెడరేషన్ అధ్యక్షుడు షాహెద్ మహ్మద్ షేక్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. పట్టణంలో వందకు పైగా ఫిల్టర్ వాటర్ కేంద్రాలున్నాయని అందులో నిబంధనలకు విరుద్ధంగా నీళ్ల ఫిల్టర్ చేస్తున్నారని, కొన్ని క్రేంద్రాల్లో ఎలాంటి ఫిల్టర్ లేకుండాలనే డబ్బాల్లో నింపి సరఫరా చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'బీఆర్‌ఎస్‌లో కష్టపడ్డ వారికి గుర్తింపు లేదు'

మెట్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు దక్కడం లేదని మాజీ జెడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం మాట్లాడారు. ప్రతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినా.. తనకు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతోనే పార్టీని వీడినట్లు తెలిపారు.అంతకుముందు పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, బొడ్ల రమేశ్ పాల్గొన్నారు.

'ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలి'

వెల్గటూర్: ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుషనపల్లి రవి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. 12 శాతం ఉన్న మాదిగలను మభ్య పెడుతూ కాంగ్రెస్, బీజేపీలు మోసం చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నాయన్నారు. మాదిగలను మోసం చేసిన పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాజేశ్, మండల అధ్యక్షుడు ఎనగందుల రవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లకు రక్షణ కరువు

- గొల్లపల్లి మండలంలో ప్రహరీలు లేని 18 పాఠశాలలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- మూగజీవులు, విష కీటకాల సంచారం
- భయాందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



లక్ష్మీపూర్ ఎస్సీ కాలనీ పాఠశాలలో అసంపూర్తిగా ప్రహరీ



ప్రహరీ లేని దమ్మన్నపేట పాఠశాల

గొల్లపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువైంది. ప్రహరీలు లేక పోవడంతో మూగ జీవాలకు, విష కీటకాలకు ఆవాసాలుగా మారాయి. పాఠశాలల చుట్టూ ప్రహరీలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మండలంలో మొత్తం 41 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 18 పాఠశాలలకు పూర్తి స్థాయిలో ప్రహరీలు లేవు. మిగిలిన పాఠశాలల్లో పాత గోడలు మరికొన్ని చోట్ల కొంతమేరకు ఒక భాగంలో నిర్మాణాలు చేపట్టి మిగతా వైపు అసంపూర్తిగా వదిలేశారు. ప్రదానంగా ప్రహరీలు లేకపోవడంతో పాఠశాలల పనివేళలు ముగిసిన తరువాత గేదెలు, ఆవులు, పందులు, ఇతర మూగజీవాలు ఆవరణలోకి వచ్చి మలవిసర్జన చేస్తుండటంతో అపరిశుభ్రతంగా మారుతున్నాయి. ఉదయాన్నే ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు రాగానే, పేడకుప్పలు, చెత్త చెదారం ఉంటుండడంతో వారే తొలగించుకోవాల్సిన పరిస్థితుల నెలకొంటోంది. పైగా స్కూళ్ల ఆవరణలో హరితహారంలో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. ఇది ఇలా ఉండగా కొన్ని పాఠశాలలు రాత్రి వేళలలో మందుబాబులకు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

విష కీటకాలతో భయందోళన..

మండలంలోని చాలా పాఠశాలలు ఊరికి చివరన గుట్టలు, చెట్ల పొదలను ఆనుకొని ఉండటం..చుట్టూ ప్రహరీలు లేకపోవడంతో విషపురుగులు, కీటకాలు సంచరిస్తున్నాయి.దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మన ఊరు..మనబడి కింద పాఠశాలకు రూ.లక్షలాది నిధులు మంజూరైనా ప్రహరీలు ఎందుకు నిర్మించడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు విడుదల చేసిన(సీడీపీ) నిధులతో పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, వాటికి కావాల్సిన మౌలిక వసతులు వివరాలను ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం ఇటీవల సీడీపీ నుంచి 40 శాతం నిధులు, ప్రభుత్వ పాఠశాలకు ఖర్చు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిధులతో త్వరలోనే పాఠశాలల్లో వసతులు కల్పించి ఇతర సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జమునాదేవి, ఎంఈవో

అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెబాట





మెట్‌పల్లి, రాయికల్‌లో నిరవధిక సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

కోరుట్ల: ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్‌తో అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం సమ్మెబాట పట్టారు. ఉద్యోగులంతా తమ కేంద్రాలకు తాళాలు వేసి సమ్మెలో పాల్గొన్నారు. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పింఛన, ఈఎస్ఐ,ఇతర సదుపాయాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం సమీపంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసి నాయకులు, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న టీచర్ల సమ్మె శిబిరాన్ని సోమవారం బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి, కాంగ్రెస్ నాయకులు షాకీర్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

రాయికల్: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ రాయికల్ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం తహసీల్ కార్యాలయ ఆవరణలో నిరవదిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, పార్వతమ్మ, రోజా, లావణ్య, రాధ, రమా, రాజేశ్వరి, పాల్గొన్నారు.

పెగడపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవదిక సమ్మె చేపట్టారు. అంగన్‌వాడీల సమ్మెతో కేంద్రాలు మూతపడి పోషకాహారం పంపిణీ నిలిచిపోయింది.

సారంగాపూర్: తమ ఉద్యోగాలను రెగ్యూలర్ చేయాలని కోరుతూ సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లో సోమవారం అంగన్‌వాడీ టీచర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మల్యాల: మండలకేంద్రంలోని బ్లాక్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు తమ డిమాండ్ల సాధన కోసం దీక్ష చేపట్టారు. పలువురు కాంగ్రెస్ నాయకులు వారికి సంఘీభావం ప్రకటించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వెల్గటూర్: తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మె చేపట్టారు. వెల్గటూర్, ఎండపల్లి మండల అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సమ్మెకు దిగారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి ప్రత్యేక కృషి



కలశపూజలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, నాయకులు

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయ కలశపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆలయాల్లో నిత్య పూజలు అందించేలా పూజారులకు ప్రభుత్వం దూపదీప నైవేద్యం కింద నెలనెలా గౌరవ వేతనం చెల్లిస్తోందన్నారు. దీంతో అన్ని ఆలయాల్లో నిత్య పూజలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరె సౌజన్య, నాయకులు బాల ముకుందం, రవి, హరీశ్, కరుణాకర్, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పేస్కేలు అమలు చేయాలని వినతి

మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న తమకు పేస్కేల్ అమలు చేయాలని జగిత్యాల జిల్లా జాక్ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మార్కెట్ కమిటీలో సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జగిత్యాల: సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వేతన పేస్కేలు అమలు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

'నా కుమారుడిని ఆశీర్వదించండి'

కోరుట్ల: వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సతీమణి కల్వకుంట్ల సరోజన కోరారు. సోమవారం కోరుట్ల పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని అతి పురాతన వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం సూపర్ బజార్, గోదాం రోడ్‌లో ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని 4 సార్లు తన భర్త విద్యాసాగర్ రావును గెలిపించారని, ఈ సారి తన కుమారున్ని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గం ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో ముదిరాజ్‌ల నిరసన ర్యాలీ

కథలాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ ముదిరాజ్ కులస్తులకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ కథలాపూర్‌లో ఆ సంఘం సభ్యులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అన్ని గ్రామాల ముదిరాజ్ కులసంఘం సభ్యులు కథలాపూర్‌కు చేరుకొని ర్యాలీ నిర్వహించారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖలో ముదిరాజ్ కులస్తులందరికీ సభ్యత్వం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటు కోసం పోరాటం

వెల్గటూర్: పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుకు నిరంతరం పోరాటం చేస్తానని ఎర్రంశెట్టి మునీందర్ అన్నారు. పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన విద్యావేత్త, సామాజిక సేవకుడు ఎర్రంశెట్టి మునీందర్‌ను రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య సోమవారం నియమించారు. ఈ సందర్భంగా మునీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆసునూరిగూడెం జీపీపై కుదరని ఏకాభిప్రాయం

సారంగాపూర్: బీర్‌పూర్ పరిధిలోని ఆసునూరిగూడెం, లంబాడిగూడెం, కట్టకిందినాయకపుగూడెం గిరిజన గ్రామాలను కలిపి గ్రామపంచాయతీ ఏర్పాటుపై బీర్‌పూర్ గ్రామ ప్రజలకు, ఆయా గూడెం గిరిజనుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. సోమవారం బీర్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశమైన గిరిజనులు, బీర్‌పూర్ గ్రామస్తుల మధ్య గ్రామ శివారుల్లోని కుంటలు, చెరువులు తదితర అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో తీర్మానానికి ఆమోదం లభించలేదు. దీంతో పాటు బీర్‌పూర్ నుంచి మోతీనగర్‌ను విడదీసి మరో గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కొత్తగా డిమాండ్ తెరపైకి వచ్చింది. కార్యక్రమంలో ఎంపీపీ రమేశ్, సర్పంచ్ శిల్ప,ప్రజలు పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు భూమిపూజ

రాయికల్: పట్టణంలోని 11వ వార్డులో రూ.4 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు సోమవారం కౌన్సిలర్ మ్యాకల అనురాధ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల కాంతారావు, నాయకులు రమేశ్, ఆంజనేయులు, రవీందర్, రాజేందర్, బుచ్చమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల డింమాండ్లను నెరవేర్చాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ తిరుమల గంగాధర్ గౌడ్ అన్నారు. పట్టణంలో సోమవారం మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు కరోనా కష్ట కాలంలో కూడా ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు తాము సంఘీభావం ప్రకటిస్తున్నామని తెలిపారు.అంగన్‌వాడీ టీచర్లను ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరింపులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత వారి డిమాండ్లు నెరవేరుస్తుందన్నారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన రచన



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న రచన

కథలాపూర్: తాండ్ర్యాల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రుద్ర రచన సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌కు రాఖీ కట్టారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో రచన అనాథగా మారింది. ఈ క్రమంలో రచన ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేయడానికి మంత్రి కేటీఆర్ ఆర్థికసాయం అందించిన విషయం తెలిసిందే.

ఎమ్మెల్యేగా గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తా




వృద్ధురాలికి నమస్కరిస్తున్న మేడిపల్లి సత్యం

కొండగట్టు: ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలం రామకిష్టాపూర్‌లో సోమవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి హాజరయ్యారు.మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఇంతవరకు ఎందరినో గెలిపించారని తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరి నారాయణ కడారి మల్లేశం, గుడి మల్లిఖార్జున్‌రెడ్డి, గడ్డం జీవన్ రెడ్డి, పిడుగు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కొరతపై ప్రభుత్వం దృష్టి సారించాలి

మెట్‌పల్లి: యూరియా కొరతను నివారించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కొమొరెడ్డి కరం డిమాండ్ చేశారు. పట్టణంలోని సోమవారం ఆయన మాట్లాడారు. యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. కొరత లేదని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. మార్కెట్‌లో యూరియా తగినంత లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులతో ఉపాధ్యాయులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు గోపికలు, విద్యార్థులు కృష్ణుడి వేషధారణలో సందడి చేశారు. ఉట్టి కొట్టేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. ఉట్టి కొట్టిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి రవి, ఉపాధ్యాయులు సాయిరెడ్డి, గంగాధర్, రమేశ్, లత, రాజేశ్వరి, వర్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల గేట్లు తెరిచిన అధికారులు



గేటు తాళం పగులగొడుతున్న రెవెన్యూ సిబ్బంది

కోరుట్ల: అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె బాట పట్టి, అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేయడంతో సోమవారం అధికారులు తాళాలు పగులగొట్టి గేట్లు తెరిచారు. తహసీల్దార్ కిషన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రేమలత కేంద్రాలకు వెళ్లి తాళాలు పగులగొడుతున్న సమయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు గొడవకు దిగారు. కొంత సేపు వాగ్వాదం తర్వాత ఉద్యోగులు సమ్మెకు వెళ్లారు.

కథలాపూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో ఉండటంతో అంగన్‌వాడీ కేంద్రాలను తాత్కాలికంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు, సెర్ప్ వీవోఏలకు ఆదేశాలు రావడంతో సోమవారం వారు ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాలకు తాళం వేసి ఉండటం.. అంగన్‌వాడీ టీచర్ల వద్ద తాళాలు ఉండటంతో కార్యదర్శులు ఏమి చేయాలో తెలియక సతమతమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పౌష్టికాహారంను కార్యదర్శులు, సెర్ప్ వీవోఏలు కలిసి గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేయాలని సూచించినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేశ్ పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

విషజ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండలంలోని రాఘవపేటలో సోమవారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో గ్రామస్తులకు ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి 15 మంది రక్తనమునాలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నత్తి లావణ్య, ఉపసర్పంచ్ ఎండీ.అమీనొద్దిన్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

బుగ్గారం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను జెడ్పీటీసీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు మూల సుమలత, గాదె తిరుపతి, వైస్ ఎంపీపీ సుచేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని నిరసన

కోరుట్ల: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న హోంగార్డ్ రవీందర్ మృతికి సంతాపం తెలిపారు.

హోంగార్డు మృతికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంతాపం

కొండగట్టు: హైదరాబాద్‌లో హోంగార్డు రవీందర్ మృతికి నాచుపెల్లి జేఎన్‌టీయూ కళాశాలలో రాష్ట్ర ఔట్ సోర్సింగ్ జేఏసీ తరపున సోమవారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏ ఒక్క ఉద్యోగి బలిదానాలు చేసుకోవద్దని, ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యూలర్ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు సన్మార్గంలో ముందుకెళ్లాలి

మల్లాపూర్: విద్యార్థులు, యువత సన్మార్గంలో ముందుకెళ్లాలని వేంపల్లి సర్పంచ్ బిట్ల సరోజన అన్నారు. సోమవారం మండలంలోని వీవీరావు పేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్పోర్ట్స్ టీ–షర్టు(జెర్సీ)లను పంపిణీ చేసి మాట్లాడారు. యువత, విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు దోహదపడుతాయని, చదవుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకట్రావ్‌పేట సర్పంచ్ జోగుల మమత, ఎంపీటీసీలు గుగ్లావత్ భూమి, తోట సుజాత, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు

జగిత్యాలరూరల్: ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గాయత్రి తెలిపారు. మండలంలోని లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 13 న అండర్ – 14, 17 బాలికలకు అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్ పోటీలు, ఈనెల 14న అండర్ –14, అండర్–17 బాలురకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు.

మల్లాపూర్: మండలంలోని రాఘవపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి రెండు రోజుల పాటు మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థులు జెడ్పీ హైస్కూల్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల రూరల్: మండలంలోని ఐలాపూర్, యూసుఫ్‌నగర్, కల్లూర్, కిషన్‌రావుపల్లె, మాదాపూర్, సర్పరాజ్‌పల్లె, పైడిమడుగు, జోగిన్‌పల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఇబ్రహీంపట్నంలో లోకల్ కోర్టు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఇబ్రహీంపట్నం,మల్లాపూర్ మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు ఏడీఈ కె. శ్రీనివాస్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

బుగ్గారం: మండల కేంద్రంలో బుధవారం నుంచి ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహించనున్నట్లు ఎంఈవో బత్తుల భూమయ్య తెలిపారు. 13 వ తేదీన అండర్ –14,17 కేటగిరీలో బాలికలకు, 14న అండర్ – 14,17 కేటగిరీలో బాలురకు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.